కథానిక

# ది రైటర్



'దట్ రైటర్ ఈజ్ మోస్ట్ ఒరిజినల్ హూ కెన్ అడాప్ట్ ఫ్రమ్ ది గ్రేటెస్ట్ నంబర్ ఆఫ్ సోర్సెస్' అన్న థామస్ కేర్‌లైల్ సూక్తి వర్ధమాన రచయిత లక్ష్మీనాథ్‌కి తెలుసు.

సమాజానికి పనికివచ్చే సామాజిక స్పృహగల రచనలు చేసే ఆసక్తి అధికంగా వున్నవాడు కాబట్టే అతను ఈసారి ఒక్కటే సాంఘిక సమస్యని కథావస్తువుగా ఎన్నుకున్నాడు. అది వ్యభిచారం. మనిషెంత పాతదయినా ఆ వృత్తిలో మగ్గే మహిళల కష్టాలని కళ్ళకి కట్టినట్లు రాసి, అది చదివిన ఎంతమందికయినా 'అబ్బా! ఎంతటి హీనమయిన బ్రతుకులు వాళ్ళవి' అనిపించేలా చేయా లనుకున్నాడు.

థామస్ కేర్‌లైల్ స్ఫూర్తిని అక్షరాలా పాటించే రచయితయిన లక్ష్మీనాథ్ వ్యభిచారం మీద వచ్చిన ఇతర నవలలు, పుస్తకాలు చదివాడు. చివరికి నవలలో సహజత్వం కోసం వాళ్ళ జీవితాలని పరిశీలించాలనే అభిప్రాయానికి వచ్చాడు.

ఓ రోజు ధైర్యంచేసి విశాఖపట్నం నించి దగ్గరలో వున్న ఓ చిన్న ఊరికి వెళ్ళాడు. ఆ రాత్రి తొమ్మిదిన్నరకి, జేబులో చిన్న నోట్‌బుక్, పెన్‌తో ఆ సందులోకి ప్రవేశించాడు లక్ష్మీనాథ్. గుమ్మాలముందు రకరకాల వయస్సుల్లో అనేక రకాల ఆడవాళ్ళు నిలబడి వున్నారు. ఒకరిద్దరు ఉత్సాహంగా లక్ష్మీనాథ్‌ని ఆహ్వానించారు కూడా. అతను ఆ వాతావరణం గురించి మనసులో గుర్తు పెట్టుకుంటూ ఓ పాతికేళ్ళ అమ్మాయి దగ్గరకి వెళ్ళాడు.

"రండి." అలవోకగా నవ్వి లోపలికి దారితీసింది.

లక్ష్మీనాథ్ ఆమెవెంట ఓ గదిలోకి నడిచాడు. ఆ గదిలోని వస్తువులు, ఆ గది తీరుతెన్నులు ఆసక్తిగా గమనించాడు.

"రాత్రంతా వుంటారా?" అడిగింది.

"ఉహూ, గంటన్నర చాలు".

"గంటన్నర అనకండి. వుంటే రాత్రంతా వుండండి. లేదా ఓసారికి వుండండి. అది పద్ధతి."

ఆమె అంత సున్నితంగా చెప్పినా అది ఎంతో పచ్చిగా అనిపించింది లక్ష్మీనాథ్‌కి.

"ఏభై." చెప్పి చెయ్యి చాపింది.

లక్ష్మీనాథ్ జేబులోంచి ఏభై రూపాయల నోటు తీసి ఆమెకి అందించాడు. దాన్ని చిన్న హేండ్ బేగ్‌లో భద్రంగా దాచుకొంది.

"నీ పేరు?" అడిగాడు లక్ష్మీనాథ్ ఆమె ప్రక్కనే మంచంమీద కూర్చొని, మీద చేతులు వేస్తూ.

"కొంచెం సేపు ఆగండి. సాగరి." చెప్పింది కొద్ది దూరంగా జరిగి.

"అంత మంచి పేరా ? నీ పెద్దవాళ్ళు పెట్టిందే?" నవ్వాడు.

బదులుగా నవ్వింది కాని, జవాబు చెప్పలేదు సాగరి.

"ఎంతకాలం నించి ఈ వృత్తి చేస్తున్నావ్?" అడిగాడు మళ్ళీ.

"అయిదేళ్ళు."

"ఇంతవరకు ఎంతమంది కస్టమర్స్‌ని చేశావ్?"

"లెక్క లేదు. వందల్లో. మీరు ఎన్నోసారి రావడం?" అడిగింది సాగరి.

"మొదటిసారే. ఈ వృత్తిలో వుండటానికి సిగ్గు వెయ్యదూ?"

"లేదు మీకు పెళ్ళయిందా?" అడిగింది.

"అయింది. కస్టమర్స్‌లో, తరచు వచ్చేవాళ్ళుకూడా వుంటారా?" అడిగాడు.

"ఆహా. మీ భార్యకి ఈ సంగతి తెలిస్తే ఎలా ఫీల్ అవుతుంది? మీ కెంతమంది పిల్లలు?" అడిగింది సాగరి.

"నా భార్యకి తెలిసే అవకాశం లేదు. ఇద్దరు పిల్లలు. మరి నీకు పెళ్ళి చేసుకుని సంసార జీవితం గడపాలని లేదా? నిన్నెవరయినా పెళ్ళి చేసుకుంటానంటే ఒప్పుకుంటావా? సుఖవ్యాధుల భయంలేదా?" అడిగాడు.

"ఈ వృత్తిలో వ్యాధులు తప్పవు కదా...మీరు వేశ్యని వివాహం చేసుకుంటే సంఘం మిమ్మల్ని ఎలా చూస్తుందో చెప్పగలరా? మీకు మీ భార్యని దగ్గరకి తీసుకున్న అనుభూతి వేశ్యలవల్ల వస్తుందా? మీరేం చేస్తున్నారు? మీ ఆదాయం ఎంత?" అడిగింది.

లక్ష్మీనాథ్‌కి అపుడనిపించింది తను కొన్ని వివరాలు సేకరించాలని వస్తే, ఆమెకూడా అదేపని చేస్తోంది.

"అసలు నేను నీతో సెక్స్‌కోసం రాలేదు. ఓ రచయితని. వేశ్యల జీవితాల గురించి నవల రాస్తున్నాను. నాకు కొన్ని వివరాలు చెప్పాలి." జేబులోంచి నోట్‌బుక్ తీశాడు.

సాగరి అతని వంక చిత్తరపోతూ చూసి చెప్పింది మెల్లిగా.

"అలాగా! అయితే నా పేరు సాగరి కాదు. నేను వేశ్యని కాను."

"వేశ్యని కావా?" ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మీనాథ్.

"నేనో రచయిత్రిని. వేశ్యలదగ్గరకి వచ్చే విటుల మనస్తత్వం మీద నవల రాసే ప్రయత్నంలో ఇలా నటించడానికి వచ్చాను. నా ప్రశ్నలకి విటులు సమాధానం చెప్పాక నేను బయటికి వెళ్ళి వేశ్యని పంపిస్తుంటాను." ఆమె అతనికి డబ్బు తిరిగి ఇచ్చేసి చెప్పింది.

మల్లాది వెంకట కృష్ణమూర్తి